# మనసెరిగిన మనసు!



"అందరికీ గతం వుంటుంది.అది ఎన్నో తీపి, చేదు అనుభవాలతో నిండి వుంటుంది."

"కాదనను.కాని ఎంత తీపి అనుభవాలనైనా తర్వాత మరచిపోవాలి,లేకపోతే ప్రమాదం."

"అది అసాధ్యం అంటాను.ఒకవేళ ఎవరైనా అలా మరచిపోయామని చెబితే అది ఆత్మవంచనే అంటాను."

"నువ్వు ఎలాగైనా అనుకో. కాని వాటిని తలచుకుంటూ వుంటే వర్తమాన జీవితం దుర్భరం అవుతుంది."

"అది మానసికంగా బలహీనులైన వారికి వర్తిస్తుంది.నాలాంటివారికి అది వర్తించదు."

"అయినా గతంలోని తీపి అనుభవాలను ఇపుడు నెమరువేసుకోవడం నీచత్వం కాదా?

"మీరు మనసులో ఏదోఊహించుకొని మాట్లాడుతున్నారు."

"అదేమిటో నీకుతెలియదా?"

నేను నవ్వాను.చాలాబిగ్గరగా,పకపకా నవ్వాను. నా నవ్వు ఆయనకు కోపం తెప్పించింది.

"అలా నవ్వద్దని నీకు చాలాసార్లు చెప్పాను"

"ఏంచేయను?మీరలా మాట్లాడుతుంటే నాకు నవ్వాగదుమరి."నవ్వుతూనే అన్నాను.

"నేనన్నదాన్లోతప్పేముంది?"ఉక్రోషంగా అన్నారాయన.

"తప్పేముందని మెల్లగా అంటారే!అసలు మీ ఆలోచనాధోరణే తప్పు"

"నువ్వు వితండవాదం చేస్తున్నావు.నీ ఆలోచన తప్పని ఒప్పుకోవుకాని నన్ను మాత్రం తప్పుపడతావు." అన్నారు సీరియస్‌గా.

నేను ఆయన దగ్గరగా వెళ్ళి ఆయన ముఖాన్ని రెండు చేతులతో నావైపు తిప్పుకొని,

"కోపమొచ్చిందా?"అన్నాను.

"ఆబ్బే!నాకెందుకువస్తుంది కోపం? నేను కేవలం నీ మొగుడ్ని కదా."

"అబ్బా !మీరంత భార్యావిధేయులన్నమాట."అన్నాను ఆయన నుదుటిపై ముద్దు పెట్టుకుంటూ.

'ఔనుమరి.ఇలాంటి చేష్టలు చేసే భార్య వుంటే ఎవడుమాత్రం లొంగిపోడూ.'గొణుక్కొంటున్నట్టు అన్నారాయన.

"ఈమాత్రానికే లొంగిపోయే భర్త తోఎలావేగేది?"నాబుగ్గ మీద చేయి పెట్టుకొని బెంగ గా అన్నాను.

"ఆమాట అనాల్సింది నేను.ఇష్టం వచ్చినట్టు వాదించి తనమాటే నెగ్గాలనే భార్యతో ఎలా వేగాలో తెలియడం లేదు." అన్నారాయన.

అప్పటివరకు సరదాగా వున్న నేను సీరియస్ గా ఆవిషయం గురించి చర్చించాలని నిర్ణయించుకున్నాను.

"ఓ.కే.లెటస్ కమ్ టు ద పాయింట్.నేను వితండవాదం చేయడం లేదు. మీరు చెప్పదలచుకున్నదేదో స్పష్టంగా చెప్పండి."అన్నాను.

"సరే.చెబుతాను విను.గోపాల్‌కు సాయంచేయమని నన్నగడం నాకు నచ్చలేదు."

"ఎందుకని?"వెంటనే సూటిగా అడిగాను.

ఆయన రెండు క్షణాలు మాట్లాడలేదు.

"చెప్పండి.ఎందుకు ఇష్టం లేదు?"రెట్టించి అడిగాను.

"నీకు తెలియదా?"ఎదురు ప్రశ్న వేశారు.

"అలా మాట్లాడవద్దు.మీ మనసులో ఏముందో నాకెలా తెలుస్తుంది?"అన్నాను.

"నీకు తెలుసు.అయినా నాచేత చెప్పించాలని నీపంతం.ఔనా? సరే విను.గోపాల్ ఒకప్పటి నీ క్లోజ్ ఫ్రెండ్.... మోసగాడు...అటువంటి వాడికి సాయం చేయమని అడగడం తప్పు.అసలు అలాంటి ఆలోచనే నీకు రాకూడదు."తన మనసులోని మాటను చెప్పినందుకు నాకు సంతోషం కలిగింది.

అయినా నా సంతోషాన్ని కనిపించనీయకుండా, "చూశారా! ఇపుడు కూడా మీరు చెప్పదలచుకున్నది స్పష్టంగా చెప్పలేదు. సగమే చెప్పారు. అది కూడా పదాలను చాల జాగ్రత్తగా వాడుతూ."

"మనం భార్యాభర్తలం. మనమధ్య సెన్సార్‌షిప్ ఎందుకు? స్పష్టంగా తేల్చిచెప్పేయవచ్చుగా" అన్నాను.

"అంతకన్నా స్పష్టంగా చెప్పడం నా వల్ల కాదు" అన్నారు కోపంగా.

"కోపం వద్దు డియర్. పోనీ మీ మనసులో మీరేమనుకుంటున్నారో నేనే చెప్పేస్తాను సరేనా?" అని ఆయన వంకచూశాను. చెప్పమన్నట్టు నా వంకచూసి, మళ్లీ ఏమనుకున్నారో, ఏమో, మొహం తిప్పేసుకున్నారు.

నేను చేత్తో ఆయన ముఖాన్ని నా వైపుకి తిప్పుకుంటూ,

"చెప్పేస్తున్నా...గోపాల్ ఒకప్పటి నీ ప్రియుడు. మీరిద్దరు ప్రేమించుకున్నారు. పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. కాని గోపాల్ మాట తప్పి, మొహం చాటేశాడు. ప్రేమకు ద్రోహం చేశాడు. ఆ తర్వాత మన పెళ్ళి జరిగింది. పెళ్ళయ్యాక పాతరోజుల్ని, ఆ ప్రేమల్ని మరచిపోవాలి, పూర్తిగా మనసులోంచి తుడిచివేయాలి. వాటిని పెళ్ళితర్వాత కూడా గుర్తుంచుకోవడం చాలా ఘోరం, పాపం. అటువంటిది నువ్వు నీ మాజీ ప్రియుడు ఐదేళ్ళ తర్వాత మళ్ళీ ఇవుడు కనిపించగానే పాతప్రేమలన్నిటినీ గుర్తుకు తెచ్చుకొని, అతని మీద జాలి చూపిస్తావా? ఇదసలు సంసారం చేసే ఆడపిల్ల లక్షణమేనా? పైగా అతనికి సాయం చేయమని సాక్షాత్తూ భర్తనే డిమాండ్ చేస్తావా? ఇది మరీ బరితెగించిన తనం. నేను కాబట్టి, మంచివాడ్ని, మెత్తనివాడ్ని కాబట్టి ఊరుకున్నానుగాని, మరొకరైతే నాలుగుతన్ని మెడపట్టి బయటికి గెంటేసేవాడు... ఇది మీ మనసులో మీరనుకొంటున్నది. ఔనా?" అన్నాను. సుదీర్ఘంగా మాట్లాడడంతో ఆయసం వచ్చినట్టు నటిస్తూ కాసేపు ఆగాను.

ఆయన ఆశ్చర్యంగా 'నా మనసుని అంత స్పష్టంగా ఎలా చదవగలిగావు?' అన్నట్టు నాకళ్ళలోకి చూసి

తలదించేసుకున్నారు.

"మీరంటే నాకందుకే చాలచాల ఇష్టం. నన్ను కనీసం మాటలతోనైనా కష్టపెట్టడానికి మీరు ఇష్ట పడరు. ఏ విషయాన్నైనా హాయిగా, మనసు విప్పి మాట్లాడుకోవడానికి అవకాశం ఇస్తారు. నాకందుకే మీరంటే ఇష్టం" అన్నాను.

"అందుకేనా చెవులుపట్టి ఆడిస్తుంటావ్? అసలు నేనూ అందరి మొగుళ్ళలా వ్యవహరించివుంటే..." అని అర్థోక్తిలోనే ఆగిపోయారు.

"వుండరు. అలా వుండకపోవడం మీ సంస్కారం. చదువు, పరిసరాలు, పెంపకం నేర్పిన సభ్యత సంస్కారం. అది లేనివాళ్ళే మృగాల్లా వ్యవహరిస్తారు" అన్నారు.

"సరే వాళ్ళసంగతి వదిలేయ్. మనిద్దరి సంగతి మాట్లాడుకుందాం. గోపాల్‌కు సాయం చేయా లంటే...నేను ఆలోచించుకోవాలి" అన్నారు.

"మంచిపని చేయడానికి ఆలోచించనక్కర లేదండి. చెడ్డపని చేయడానికే ఒకటికి పది సార్లు ఆలోచించాలి."

"నేను కాదనను. కాని ఎంతైనా నేనూ సగటు మగవాడినే, సగటు భర్తనే. మహాత్ముడ్ని కాదు. అందుకే... గోపాల్‌ని తలచుకోగానే నీ మాజీ ప్రియు డన్న భావం నన్ను బాధిస్తోంది. అందులోనూ నువ్వు ఇవుడు అతనిపట్ల జాలి, అభిమానం చూపడం...నిజం చెప్పమంటావా...చాలా జెలసీగా, ఉక్రోషంగా వుంది." అన్నారు నా తలపై చేయివేసి నిమురుతూ.

నేను మెల్లగా ఆయన ఎదపైవాలిపోయాను. రెండు క్షణాల మౌనం తర్వాత నేను మెల్లగా అన్నాను.

"ప్రతిమనిషికి-పెళ్ళికిముందు, పెళ్ళితర్వాత-అని రెండు జీవితాలుంటాయి. మీరన్నట్టు పెళ్ళి తర్వాతి జీవితం సాఫీగా సాగాలంటే పెళ్ళికి ముందు జీవితంలోని కొన్ని జ్ఞాపకాల్ని, సంఘ టనల్ని పూర్తిగా తుడిచివేయాలి. నేను చేసిందీ అదే. నాకిప్పడు గోపాల్ అంటే కేవలం జాలి.



అంతే. అతడు నాకు మంచి స్నేహితుడిలా వుండేవాడు. ఇప్పటికీ అతడ్ని స్నేహితుడిగానే పరి గణిస్తున్నాను. మా పెళ్ళి జరగకపోవడానికి నేను, అతను ఇద్దరమూ కారణం కాదు. ఆ విషయం మీకు తెలుసు. అయినా మంచి మనసున్న మీ వల్లని సహచర్యంలో వుంటూ మరొకరి గురించి 'వేరే'గా ఆలోచించేంత నీచురాల్ని కాదు" అన్నాను.

ఆయన వెంటనే,

"అబ్బే...నేనలా అనలేదు. అనను కూడా. మన ఐదేళ్ళ వైవాహిక జీవితంలో నేను నిన్నెప్పడైనా అనుమానించానా? చెప్ప! నిన్ను అనుమానించడం అంటే నన్ను నేను అనుమానించుకోవడమే...అం తకుమించిన అవమానం ఏముంటుంది? చెప్ప! భార్యాభర్తల మధ్య వుండాల్సింది నమ్మకం-అని చెప్పారు బాపు..'పెళ్ళిపుస్తకం'లో" అన్నారాయన.

ఆయన మాటలకు నా కళ్ళనుంచి రాలుతున్న రెండు కన్నీటి చుక్కలను ఆయనకు తెలియకుండా తుడిచేసుకున్నాను.

కొద్దిక్షణాల తర్వాత మళ్ళీ ఆయనే అన్నారు.

"గోపాల్‌కి సాయం చేయాలని ముందుగానే నిర్ణయించుకున్నాను. ఐనా నిన్ను కాసేపు ఆటప ట్టించాలనిపించింది. అందుకే అలా మాట్లాడాను. పైగా ముందే చెప్పాగా, నేనూ సగటు మగాడినేనని. అందుకే నిన్ను మాటల్తో బాధించాను. ఇవుడు అమ్మగారు శాంతించినట్టేనా?" అన్నారు.

నేనేమీ మాట్లాడలేదు.

ఆయన ఒడిలో అలాగే ఒదిగివుండిపోయాను.

– "మోతీలాస్య"




